క్లుప్తంగా

నూకాలమ్మ ఆలయ వార్షిక వేడుకలు ప్రారంభం


నూకాలమ్మ సారెను ఊరేగిస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు శీకువాని పాలెంలో కొలువుదీరిన నూకాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు క్షీరాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సారె ఊరేగించారు. ఈ నెల 30న శనివారం ఉదయం 8 గంటల నుంచి అమ్మవారికి కుంకుమార్చనలు, 31న ఆదివారం ఉదయం అగ్నిహోమం నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు, దుర్గమాంబ యూత్ సభ్యులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ అధికారికి సత్కారం


స్టీల్‌ప్లాంట్ అధికారి సూరి అప్పారావు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ పాలిశెట్టి సూరి అప్పారావును శుక్రవారం సత్కరించారు. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా హెచ్ఆర్ విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో సత్కార సభ ఏర్పాటు చేశారు. హెచ్ఆర్ జీఎం కె. సంజీవరావు, డీజీఎంలు ఎస్.కె.ఖర్, వి.అరుణలు సూరి అప్పారావు దంపతులకు శాలువా కప్పి పూలమాలలతో అభినందించారు. వారికి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ బి.జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీలో అడ్మిషన్లు ప్రారంభించాలని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం (కేవీ)లో 2024–25కు ఫస్ట్‌క్లాస్ నుంచి అడ్మిషన్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. స్టీల్ సిటూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామితో కలిసి స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎంను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. గతంలో ఈ అంశంపై చర్చించగా యాజమాన్యం అడ్మిషన్లపై స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ పాఠశాల యాజమాన్యం నుంచి ఆ చర్యలు ప్రారంభం కాలేదని సీజీఎం దృష్టికి తెచ్చారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ అడ్మిషన్లు కొనసాగించాలని హైదరాబాద్‌లోని కేవీ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్‌కు యాజమాన్యం లేఖ రాసిందని, త్వరలో అడ్మిషన్ల నోటిఫికేషన్ వెలువడుతుందని తెలియజేశారని నాయకులు తెలిపారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనల్లో భాగంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల అమాయకులైన కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1142వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని సియోను ఆరాధనా కేంద్రం ఎంపీఎం సొసైటీ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని సొసైటీ అధ్యక్షుడు పాస్టర్ కేత సామ్‌సన్ రాజు, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ ప్రారంభించి, పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, గంట్యాడ గురుమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి.. అదిరింది

- 70వ వార్డులో రూ.8.44 కోట్లతో పనులు
- ఐదేళ్లలో పెరిగిన వసతులు
- రహదారులకు మహర్దశ

రోడ్లు, డ్రైనేజీలు	పాఠశాలలు
రూ.5.74 కోట్లు	రూ.1.04 కోట్లు
కొండవాలు ప్రాంతాలు	ఇతర పనులు
రూ.85 లక్షలు	రూ.81 లక్షలు

గాజువాక : గాజువాక నడిమధ్యన గల 70వ వార్డు అభివృద్ధికి చిరునామాగా నిలిచింది. గడిచిన ఐదేళ్లలో కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, రక్షణ గోడల నిర్మాణం మొదలుకుని వార్డు నలుమూలలా కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, సీసీ రోడ్లు, కాలువలు, పాఠశాలల అభివృద్ధి, మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు, కమ్యూనిటీ భవనం నిర్మాణం.. ఇలా ఎన్నో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. సుమారు రూ.8.44 కోట్ల నిధులతో ప్రభుత్వం ఈ పనులు చేపట్టింది.

రూ.5.74 కోట్లతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

- వార్డు పరిధిలోని ఐదు సచివాలయాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పెద్ద ఎత్తున జరిగింది. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను అన్ని కాలనీల్లో అందుబాటుకి తీసుకొచ్చారు. సుమారు 5.74 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్లను నిర్మించారు.
- దశమికొండ, చిట్టినాయుడు కాలనీలలో రూ.20 లక్షలతో మెట్లు, సీసీ కాలువల నిర్మాణం
- పాతగాజువాక రామాలయం వీధి, పల్లా చిన్నారావు వీధి, శ్రీనిధి వీధిలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం
- చిట్టినాయుడు కాలనీ మెయిన్ రోడ్, ఈఎస్ఐ ఆస్పత్రి మెయిన్ రోడ్‌లో రూ. 20 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం
- డ్రైవర్స్ కాలనీలో రూ.20 లక్షలతో బీటీ రోడ్‌ల నిర్మాణం, రూ. 10 లక్షలతో సీసీ డ్రైన్‌ల నిర్మాణం
- డ్రైవర్స్ కాలనీ, చిట్టినాయుడు కాలనీ కొండ చుట్టూ రూ.49 లక్షలతో ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణం
- డ్రైవర్స్ కాలనీ కొండవాలు ప్రాంతంలో రూ.50 లక్షలతో ఆరు వీధుల్లో మెట్లు, కాలువల నిర్మాణం
- రూ.10 లక్షలతో చట్టివానిపాలెం గ్రామంలో పరదేశమ్మ ఆలయ మార్గం సీసీ రోడ్‌గా నిర్మాణం
- చట్టివానిపాలెం కమ్యూనిటీ హాల్ రోడ్‌ను రూ.15లక్షలతో సీసీ రోడ్‌గా అభివృద్ధి చేసి, డ్రైన్లు నిర్మించారు.
- చట్టివానిపాలెం ప్రాథమిక పాఠశాలవద్ద రూ.20 లక్షలతో సీసీ రోడ్‌లు, డ్రైన్ల నిర్మాణం


దశమి కొండలో నిర్మించిన రక్షణ గోడ

- ఎల్వీ నగర్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్, డ్రైన్ల నిర్మాణం
- రూ.80 లక్షలతో ఎల్వీనగర్ నుంచి తోకాడ వరకు ఆర్‌సీసీ కాలువ నిర్మాణం చేశారు.
- రూ.10 లక్షలతో ఎల్వీనగర్ కమ్యూనిటీ హాల్ రోడ్, రూ.10 లక్షలతో ఎల్వీనగర్ దుర్గాదేవి ఆలయ రోడ్ నిర్మాణం


ఈఎస్ఐ ఆస్పత్రి బీటీ రోడ్

- శ్రామికనగర్‌లో రూ. 60 లక్షలతో ఇంటర్నల్ సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం
- రూ.20 లక్షలతో గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద సీసీ రోడ్, కల్వర్టు నిర్మాణం
- రూ.10 లక్షలతో తాబేలు కాలనీ నుంచి శ్రీనివాస నగర్ వరకు సీసీ రోడ్, డ్రైన్ నిర్మాణం


ఎల్‌బీఎస్ నగర్‌లో నిర్మించిన మెట్ల మార్గం

- రూ.10 లక్షలతో టీవీఎస్ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయ మార్గంలో ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణం
- రూ.60 లక్షలతో శ్రీనివాస నగర్‌లో మూడు ఇంటర్నల్ రహదారులను అభివృద్ధి చేశారు.

రూ.1.04 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా వార్డులోని వివిధ పాఠశాలలను రూ.1.04 కోట్లతో అభివృద్ధి చేశారు. రూ.49 లక్షలతో ఎల్‌బీఎస్ నగర్ ప్రాథమిక పాఠశాల భవనం, రూ.29 లక్షలతో చిట్టినాయుడు కాలనీ పాఠశాల భవనం, రూ.10 లక్షలతో చట్టవానిపాలెం పాఠశాల, రూ.16 లక్షలతో శ్రామికనగర్ పాఠశాల భవనాన్ని అభివృద్ధి చేశారు.

మరిన్ని అభివృద్ధి పనులు

- రూ.20 లక్షలతో ఎర్రగెడ్డ కాలనీ, శ్రామికనగర్ ప్రాంతాలకు 200 ఎంఎం డయా సామర్థ్యంతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం
- రూ.10 లక్షలతో ఎల్వీనగర్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ లైన్ ఏర్పాటు
- రూ.16 లక్షలతో ఎర్రగడ్డ కాలనీలో మల్టీపర్పస్ హాల్ నిర్మించారు.
- రూ.35 లక్షలతో చట్టివానిపాలెం శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. ఈ నిధులతో ప్రహరీ నిర్మాణం, వెయిటింగ్ హాల్, సీసీ ప్లాట్‌ఫాం, పాత్‌వే, బర్నింగ్ షెడ్ల పునర్నిర్మాణం, ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణం తదితర పనులను పూర్తి చేశారు.


చట్టివానిపాలెం శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాల్

కొండవాలు ప్రాంతాల్లో సౌకర్యాలు

వార్డులోని వివిధ కొండవాలు ప్రాంతాల్లో సౌకర్యాలను యుద్ధ ప్రాతిపదికన అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇటీవల కాలంలో వర్షాలకు కొండచరియలు విరిగి జనం ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో రక్షణ గోడలు, మెట్ల మార్గాలను నిర్మించారు. రూ.20 లక్షలతో ఎల్‌బీఎస్ నగర్, రూ.10 లక్షలతో దశమికొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం పూర్తి చేశారు. ఎల్‌బీఎస్ నగర్ కొండవాలు ప్రాంతంలో రూ.15 లక్షలతోను, చిట్టినాయుడు కాలనీ, దశమికొండ కాలనీ కొండవాలు ప్రాంతంలో రూ.20 లక్షలతోను, డ్రైవర్స్ కాలనీ కొండవాలు ప్రాంతంలో రూ.20 లక్షలతోను మెట్ల మార్గాలను అందుబాటులోకి తెచ్చారు.


కొండవాలు ప్రాంతంలో సీసీ రోడ్

నీటి సమస్య పరిష్కారమైంది



మా కాలనీకి నీటి సమస్య ఉండేది. వాటర్ డిస్ట్రిబ్యూషన్ లైన్ సరిగ్గా లేకపోవడంతో చాలాకాలం ఇబ్బంది పడ్డాం. ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగానే కొత్తగా వాటర్ డిస్ట్రిబ్యూషన్ లైన్ వేసి పరిష్కరించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, ఆర్‌సీసీ కాలువ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. మా కాలనీలో ఇలాంటి చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి.
– కె.ఎస్.నాయుడు, ఎల్వీనగర్

కొండవాలులో వసతులు కల్పించారు



మా డ్రైవర్స్ కాలనీ కొండవాలులో ఉంటుంది. ఇక్కడ చాలా సమస్యలు ఉండేవి. మెట్ల మార్గం సరిగా లేక కొండవాలు ప్రాంతానికి రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య పరిష్కారమైంది. డ్రైవర్స్ కాలనీ కొండవాలు ప్రాంతంలో కొత్తగా మెట్ల మార్గాన్ని నిర్మించడంతో అందరికీ సౌకర్యవంతంగా ఉంది. కాలనీలోని ఇంటర్నల్ రోడ్లను కూడా బాగా అభివృద్ధి చేశారు.
– భోగి జనార్ధనరావు, డ్రైవర్స్ కాలనీ

చక్కటి రోడ్లు వేశారు



మా ప్రాంతంలో రోడ్ల సమస్య పరిష్కారమైంది. గతంలో రోడ్లన్నీ పాడై పోయాయి. ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైన్లను చాలా చక్కగా నిర్మించారు. కొండవాలులో రక్షణ గోడలు, మెట్ల మార్గాలను కూడా బాగా అభివృద్ధి చేశారు. ఇంటర్నల్ రోడ్లను అభివృద్ధి చేయడంవల్ల వివిధ కాలనీలకు కనెక్టింగ్ బాగా అందుబాటులోకి వచ్చింది.
– రాయల నీలకంఠం, పాతగాజువాక

అడుగడుగునా నీరా‘జనం’

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌కు సాదర స్వాగతం
- 68, 75 వార్డుల్లో ముమ్మర ప్రచారం


అమర్‌నాథ్‌కు హారతి ఇస్తున్న మహిళలు


ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అవ్వను అభ్యర్థిస్తున్న అమర్‌నాథ్


75వ వార్డులో ర్యాలీ

పెదగంట్యాడ: జనం.. జనం.. ప్రభంజనం.. తరలి వచ్చిన అభిమానగణం.. హోరెత్తిన నినాదాలు.. అడుగడుగునా ఘన స్వాగతాలు.. మహిళల మంగళ హారతులు.. ఒక పక్క డీజే సౌండ్స్.. మరోపక్క తీన్ మార్‌తో ప్రచారం హోరెత్తిపోయింది. గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం సాయంత్రం 75వ వార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారం అదరహో అనిపించింది. పార్టీ 75వ వార్డు నాయకుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి (బుజ్జి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెదగంట్యాడ జంక్షన్, గొందేశివీధి, ధర్మాలవీధి, పాత అయ్యన్నపాలెం, అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం, ముసలినాయుడుపాలెం, నీలాపువీధి, నెల్లిముక్కు తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గాజువాక అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝన్సీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అవ్వ తాతలను ఆప్యాయంగా పలకరించారు. దుకాణాల వద్ద వ్యాపారులను కలిసి మద్దతు కోరారు.

విశాఖకు దీటుగా గాజువాక అభివృద్ధి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పక్కాగా అమలు కావాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గాజువాక నియోజకవర్గాన్ని ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని, భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని విశాఖకు దీటుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం తథ్యమన్నారు. గాజువాక ప్రాంతంపై తనకు పూర్తి అవగాహన ఉందని, ఇక్కడి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, కొయ్య భారతి, ఉరుకూటి అప్పారావు, మొల్లి చిన్న, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, గొందేశి పైడిరెడ్డి, ఉరుకూటి సింహాద్రి, పిట్టా రెడ్డి, గొందేశి సుమన్‌రెడ్డి, నాగు, వంశీకృష్ణ యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


రాంనగర్‌లో అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

68వ వార్డులో బ్రహ్మరథం

అక్కిరెడ్డిపాలెం: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీ, రాంనగర్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ప్రచారం చేపట్టారు. ముందుగా గుడివాడ అప్పన్న కాలనీలోని పైడిమాంబ అమ్మవారిని, గణపతి సహిత సంతోషిమాత అమ్మవారిని, సీతారామలక్ష్మణ స్వాములను దర్శించుకున్నారు. ప్రచారంలో భాగంగా మహిళలు అమర్‌నాథ్‌పై పూలజల్లు కురిపించి, హారతులు పట్టారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గుడివాడ అప్పన్న కాలనీలో ఓ టిఫిన్ బండిపై దోశలు వేసిన అమర్‌నాథ్ రాంనగర్‌లోని లాండ్రీ షాపులో బట్టలు ఇస్త్రీ చేశారు. చిరువ్యాపారులను ఆప్యాయంగా పలకరించి, కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ నవరత్నాల ద్వారా లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. ఆ సంక్షేమ కాంతులు ప్రతీ ఇంటా కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు.

68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, మాజీ సమన్వయకర్త ఉరుకూటి చందు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, నాయకులు పల్లా చినతల్లి, పల్లా పెంటారావు, గంధ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, ఈటి శ్యామలరావు, మొల్లి చిన్న, రెడ్డి జగన్నాథం, ఈగలపాటి యువశ్రీ, తమ్మిన నాయుడు, గుర్రం రాజేష్, త్రినాథ్, వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, రొక్కం వెంకట్రావు, రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి సురేష్, గొంతిన సత్యవతి, నేలపాటి సత్యవతి, పాలూరు రాజు తదితరులు పాల్గొన్నారు.


టిఫిన్ బండిపై దోశలు వేస్తున్న అమర్‌నాథ్


రాంనగర్‌లో లాండ్రీ షాపులో ఇస్త్రీ చేస్తూ..


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తూ ..

హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే..


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కూర్మన్నపాలెం: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 86వ వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులతో పార్టీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనకబడిన సామాజిక వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ ఎనలేని కృషి చేశారన్నారు. ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కో కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆ కార్పొరేషన్లకు ప్రత్యేక నిధులు కేటాయించి వారికి చేయూతనందించారన్నారు. ఈ సంక్షేమ ఫలాల కొనసాగింపునకు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడే ప్రతీ ఒక్కరికి భవిష్యత్తులో సముచిత స్థానాన్ని కల్పించే బాధ్యతను తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వీవీఎస్ఎం రాజా, వార్డు ప్రెసిడెంట్ వెలుగుల పరశురాముడు, వాడపల్లి రామచంద్రరాజు, సీనియర్ నాయకులు చేగొండి శ్రీనివాసరావు, చిట్టి దేవుడు, నిర్మల, శ్రీనివాస్‌పట్నాయక్, అల్లావుద్దీన్, వరలక్ష్మి, రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలపై సీఎండీకి లేఖ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సకాలంలో జీతాల చెల్లింపు చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం సీఎండీకి లేఖ అందజేశారు. గత కొంత కాలంగా కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా యాజమాన్యం చేస్తున్న జాప్యం వల్ల కార్మికులు ఇబ్బంది పడటంతో పాటు కంపెనీ ప్రతిష్ట మసకబారుతుందన్నారు. యాజమాన్యం కావాలని చేస్తున్న జాప్యాన్ని తాము నిరసిస్తున్నామన్నారు. వెంటనే జీతాల చెల్లింపుతో పాటు నూతన వేతన ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

‘నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం’

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 85వ వార్డు కొండయ్యవలసలో ఆయన పలువురు నాయకులను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ దివంగత బలిరెడ్డి నూకరాజు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు, కాలనీల సమస్యలపై అవగాహన ఉన్న తనకు అవకాశం కల్పిస్తే నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు, బోర సోమునాయుడు, కొలిపాక అప్పారావు, పెదిరెడ్ల హరీష్, గెద్దాడ సత్యవతి, దాసరి సత్యవేణి, శ్రీను, అప్పలనాయుడు, హర్ష తదితరులు పాల్గొన్నారు.


బలిరెడ్డి నూకరాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి అమర్‌నాథ్

రైలు ఢీకొని వ్యక్తి మృతి


ట్రాక్‌పై పడి ఉన్న మృతదేహం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో అగనంపూడి రైల్వే క్రాసింగ్ వంతెన వద్ద గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఎస్ఐ శాంతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుని వద్ద వివరాలేవీ లభ్యం కాలేదన్నారు. శరీరంపై ఆకుపచ్చ, ఇటుక రంగు, గళ్ల చొక్కా, తెలుపురంగులో జీన్ ప్యాంట్ ఉన్నాయని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు దువ్వాడ ఔట్ పోస్టును సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో శిలువ యాత్ర


గాజువాకలో ర్యాలీలో పాల్గొన్న హోలీ క్రాస్ చర్చి సభ్యులు


పెదగంట్యాడలో శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : గుడ్ ఫ్రైడే సందర్భంగా గాజువాక ప్రాంతంలోని క్రైస్తవులు శిలువ యాత్రలను నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు. పాతగాజువాకలోని హోలీ క్రాస్ చర్చి సభ్యులు శిలువతో గాజువాకలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద ప్రారంభమైన ర్యాలీ పాత గాజువాక, జాతీయ రహదారి మీదుగా హోలీక్రాస్ చర్చి వరకు కొనసాగింది. అనంతరం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అర్జి ప్రకాష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తుకు ప్రజలపై గల ప్రేమ, త్యాగం, కరుణను వివరించారు. కార్యక్రమంలో చర్చి విచారణాధ్యక్షుడు రెవరెండ్ జోజి తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో శాంతి ర్యాలీ

పెదగంట్యాడ: జియోన్ పీస్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సియోను ప్రార్థనా మందిరం పాస్టర్ కేత పీటర్ (అప్పారావు) ఆధ్వర్యంలో పెదగంట్యాడ ప్రధాన రహదారిలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు సంకీర్తనలను ఆలపించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు క్రీస్తు బోధనలను అనుసరించాలని కోరారు.


రాంనగర్‌లోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కార్యక్రమంలో పులి రమణారెడ్డి, క్రిస్టియన్ పాస్టర్ ఫెలోషిప్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు, సహాయ కార్యదర్శి కేతా ఎలీషా, పాల్ డేవిడ్, జుత్తుక సాల్మన్ రాజు, పాస్టర్ సామ్సన్, తిమోతి, ప్రార్థనా మందిరం సంఘ పెద్దలు, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

అక్కిరెడ్డిపాలెం: రాంనగర్‌లోని భెల్ యునైటెడ్ ఇమ్మాన్యుయేల్ చర్చిలో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్ పి.జాకబ్, ఎ.ఎన్.కుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు కె.లెబర్ రాజు, కార్యదర్శి ఎస్.డి.జేమ్స్ రాయ్, కోశాధికారి కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో..

ఉక్కునగరం: ఉక్కునగరంలోని ఆర్‌సీఎం చర్చి, క్రైస్ట్ ది సేవియర్ చర్చి, లూథరన్ దేవాలయం, ది అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.